క్లుప్తంగా

పెండింగ్ అర్జీల పరిష్కారానికి చర్యలు



అర్జీల వివరాలు తీసుకుంటున్న అధికారులు

మునగపాక : మునగపాక మండల పరిషత్ హాలులో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా అధికారులు అర్జీదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారుల ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీవో రవి కుమార్ అన్నారు. పెండింగ్ పిటిషన్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ వినయ్, ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెంకటాపురంలో 'గడప గడపకు' నేడు

మునగపాక : మండలంలోని వెంకటాపురంలో శనివారం ఉదయం 6 గంటలకు గడపగపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ లబ్ధితో కూడిన బుక్‌లెట్‌లు అందజేస్తారన్నారు. పార్టీ నాయకులు, అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

ఆహార నియమాలు పాటించాలి

పాయకరావుపేట : ప్రతి విద్యార్థి ఆహారం తీసుకునే విషయంలో నియమాలు పాటించి, పౌష్టికాహారం తీసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా పట్టణంలో గల గ్రంథాలయంలో ఆరోగ్య నియమాలు, సూత్రాలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా గుండెకు సంబంధించిన వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో సచివాలయ భవనం ప్రారంభం నేడు



వెంకటాపురం సచివాలయ భవనం

మునగపాక : మండలంలోని వెంకటాపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ప్రారంభిస్తారని సర్పంచ్ సుందరపు తాతాజీ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉదయం గ్రామంలో జరగనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రారంభం జరుగుతుందన్నారు. రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవన ప్రారంభోత్సవానికి పార్టీకి చెందిన నేతలు, అధికారులు హాజరుకావాలని తాతాజీ కోరారు.

ఫిలడెల్ఫియా చర్చిలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలోని ఫిలడెల్ఫియా చర్చిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం, ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. కీర్తిశేషులు అలుగు ప్రభాకర్‌రావు జయంతిని పురస్కరించుకొని అమ్మ చారిటబుల్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. శ్రీవిష్ణు ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలుగు శ్యాంకుమార్, వైద్యులు సుధీర్, సందీప్, జ్యోత్స్న పాల్గొన్నారు.

సత్యవరంలో...

పాయకరావుపేట : మండలంలో గల సత్యవరం గ్రామంలో జనరల్, న్యూరో వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. గురు న్యూరో కేర్ సెంటరు వైద్యులు డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ బి.సుధీర్ గ్రామంలో 100 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురు రోగులకు న్యూరో కేర్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సకిలేటి రాము, న్యూరో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత

- దెబ్బతిన్న ఎఫ్‌వోబీ
- అసంపూర్తిగా రెండో నెంబరు ఫ్లాట్‌ఫామ్ పనులు
- అధ్వానంగా పారిశుధ్యం
- ప్రయాణికులకు తప్పని అగచాట్లు



శిథిలావస్థకు చేరుకున్న ఎఫ్‌వోబి



దెబ్బతిని అధ్వానంగా మారిన వంతెన



తలుపులు ఊడిపోయిన టాయిలెట్లు

యలమంచిలి : నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి రైల్వే స్టేషన్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో రైల్వే అధికారులు నిర్లక్ష్యం చూపడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. వేసవి తీవ్రత దృష్ట్యా రైలు ప్రయాణికులు దాహార్తిని తీర్చుకోవడానికి వాటర్ బాటిళ్లను కొనుగోలు చేయక తప్పడం లేదు. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు ఈ స్టేషన్ నుండి రాకపోకలు సాగిస్తున్నారు. రైల్వేశాఖకు ఆదాయం కూడా బాగానే వస్తోంది. అయినప్పటికీ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు శీతకన్ను వేస్తున్నారు. మరో వైపు అసాంఘిక కార్యకలాపాలకు స్టేషన్ కేంద్రంగా మారడంతో మహిళా ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

అటకెక్కిన స్వచ్ఛ భారత్

స్టేషన్ పరిసరాలు, ప్లాట్‌ఫారాలు, మరుగుదొడ్లు వద్ద పారిశుధ్యం మచ్చుకైనా కానరావడం లేదు. టాయిలెట్లకు తలుపులు ఊడిపోవడంతో దుర్వాసనతో సమీపంలో ప్రయాణికులు వేచి ఉండలేని పరిస్థితి నెలకొంది. టాయిలెట్ల క్లీనింగ్ సక్రమంగా జరగడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్లాట్‌ఫారాలు, ప్రధాన ద్వారం, సర్క్యులేటింగ్ ఏరియా వద్ద చెత్త చెదారం పేరుకుపోతున్నాయి. స్వచ్ఛభారత్ అటకెక్కిందని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. యాచకులు, మందుబాబులు హల్‌చల్ చేయడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురౌవుతున్నారు. శునకాలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు.

అసంపూర్తిగా రెండో ఫ్లాట్‌ఫామ్

లాంగ్ లూప్‌లైన్ ఏర్పాటులో భాగంగా స్టేషన్‌లో రెండో నెంబరు ఫ్లాట్‌ఫామ్‌ను తొలగించి కొత్తగా నిర్మిస్తున్నారు. ఈ పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. దీంతో ఇక్కడ రైళ్లు ఎక్కేందుకు, దిగేందుకు ప్రయాణికులు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చీకటి పడితే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలువురు మహిళలు వృద్ధులు జారిపడి గాయాపడుతున్నారు. రైల్వే అధికారులకు అసంపూర్తిగా పనులు నిలిచిపోయిన రెండో నెంబరు ప్లాట్‌ఫామ్ కళ్లెదుటే కనిపిస్తున్నా పట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

శిథిలావస్థలో ఎఫ్‌వోబీ

బ్రిటీష్ కాలంలో నిర్మించిన పుట్‌ఓవర్ బ్రిడ్జి పాతది కావడంతో శిథిలమైంది. దీనిపై నడిచి వెళ్లేటప్పుడు వంతెన కదులుతోంది. దీంతో ప్రయాణికులు వంతెన కూలుతుందేమోనని భయపడుతున్నారు. మెట్ల వంతెన పై భాగం గోతులు పడ్డాయి. శిథిలమైన వంతెన ఎంతమేర సురక్షితమో రైల్వే ఇంజినీరింగ్ అధికారులకే తెలియాలి. కొత్త వంతెన నిర్మించాలని, లేని పక్షంలో కనీసం మరమ్మతులు చేపట్టి వంతెన పటిష్టంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రయాణికులు చెబుతున్నారు.

ఇవీ ప్రధాన సమస్యలు

రైల్వే స్టేషన్‌లో ఆగే రైళ్ల బోగీల వివరాలు తెలిపే డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు లేవు. దీంతో రైళ్లు ఎక్కే సమయంలో తమ బోగీ ఎక్కడ వుందో తెలుసుకోవడానికి ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

- రెండో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై తాగునీరు, టాయిలెట్లు వసతి లేదు. నీటి సరఫరా చేసే పైపు లైను పాడైంది.
- టాయిలెట్లకు తలుపులు ఊడిపోవడంతో మహిళలు వాటిని వినియోగించలేని పరిస్థితి నెలకొంది.
- క్యాంటీన్ సదుపాయం లేదు
- రైళ్ల రాకపోకలు, రిజర్వేషన్ టిక్కెట్లు, జనరల్ టిక్కెట్ల జారీ వంటి సమాచారం ప్రయాణికులకు సరిగ్గా తెలియడం లేదు.

పారిశుధ్యంపై చర్యలు తీసుకుంటాం

రైల్వే స్టేషన్‌లో కోచ్‌ల సమాచారం తెలియజేసే డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు, 2వ నెంబరు ఫ్లాట్‌ఫామ్ పనులు నిలిచిపోవడంపై ప్రయాణికులు తరచూ అడుగుతున్నారు. పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటాం. పూర్తి స్థాయిలో నీటి సరఫరా అందించేందుకు కొత్తగా పైపు లైను ఏర్పాటు జరుగుతోంది.

-ఎ.సురేష్ ఎస్ఎస్

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి



నీటి నిలువ లేకుండా చూడాలని అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి నాయుడు

మునగపాక : ప్రతి ఒక్కరూ శుక్రవారం డ్రై డేగా గుర్తించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి పీజే ఎంఆర్‌పీ నాయుడు కోరారు. మండలంలోని తోటాడ గ్రామంలో ఆయన సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. వాటర్ డ్రమ్స్, రుబ్బురోలు, ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు, డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర పాత సామాన్లలో నీరు నిల్వ ఉండిపోకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి రోగాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. దోమలు గుడ్లు పెట్టే ప్రదేశాలను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోండి



దార్లపూడిలో విద్యార్థుల వర్కులు పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయులు శాంతి ప్రసూన

ఎస్.రాయవరం : వేసవి సెలవుల్లో పాఠశాల విద్యార్థులను ఇంటి వద్ద ఖాళీగా ఉంచవద్దని దార్లపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతిప్రసూన అన్నారు. శుక్రవారం దార్లపూడి గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చిన వర్కులను విద్యార్థులు ఎంతవరకు పూర్తి చేశారన్న దానిపై తనిఖీ చేశారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యా రంగంపై ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని, దానికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాసు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



రాజుపేట జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని డీఎల్‌డీవో మంజులావాణి పేర్కొన్నారు. హౌసింగ్ డేలో భాగంగా శుక్రవారం ఆమె మండలంలోని రాజుపేట జగనన్న లే-అవుట్‌ను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అర్హులందరికీ పట్టాలు అందజేస్తున్నామని, ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సహకారం అందిస్తున్నామన్నారు. విద్యుత్ సదుపాయం, మంచినీటి సదుపాయంతో పాటు రహదారులు, డ్రైన్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ కిలాడి దేముడు, ఎంపీడీవో రవికుమార్, సచివాలయ కన్వీనర్ దాసరి అప్పారావు, ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు



ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి : మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుంది. దిమిలి ఆర్‌బీకే ద్వారా పరిసర గ్రామాల పరిధిలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. గడిచిన నాలుగు రోజుల కాలంలో సుమారు 110 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు ఏవో సి. సుమంత తెలిపారు. వీఏఏలు మేఘన, ప్రశాంతి, రామారావు తదితరులు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న తిమ్మరాజుపేట సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక : తిమ్మరాజుపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి అన్నారు. తిమ్మరాజుపేట సచివాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తిమ్మరాజుపేట పంచాయతీకి ఉత్తమ గ్రామ అభివృద్ధి ప్రణాళిక అవార్డు దక్కించుకోవడంతో రూ.50వేల సొమ్మును రివార్డుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకవర్గం, గ్రామస్తుల సహకారంతో తిమ్మరాజుపేటను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు సహకరించిన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరాలశెట్టి నరేష్, వైఎస్సార్‌సీపీ నేతలు కృష్ణారావు, గణేష్ సమావేశంలో పాల్గొన్నారు.

సుంకవూరులో హౌసింగ్ డే

కోటవురట్ల : వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఉదయ శ్రీ సూచించారు. సుంకవూరు గ్రామంలో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులను సమస్యలు అడిగి తెల్సుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలని లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'



జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించిన అధికారులు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సిహెచ్.లచ్చన్న అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజలు సమస్యలు ఎప్పటికప్పుడు తెలియజేస్తే, పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి
- సన్యాసమ్మ చెరువు వాకింగ్ ట్రాక్‌లో వ్యాయామ పరికరాలు ప్రారంభం



వ్యాయామ పరికరాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి తదితరులు

యలమంచిలి : శారీరక వ్యాయామం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. యలమంచిలి పట్టణంలో త్రిమూర్తులు స్వామి ఆలయం వద్ద ఉన్న సన్యాసమ్మ చెరువు చుట్టూ నూతనంగా వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌లో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను ఆమె స్థానిక కౌన్సిలర్లు, అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో అపారిశుధ్యంగా ఉన్న సన్యాసమ్మ చెరువును ఎమ్మెల్యే కన్నబాబురాజు కృషితో సువిశాలమైన వాతావరణంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది పట్టణంలో ప్రజలందరూ ఉదయం సాయంత్రం ఈ వాకింగ్ ట్రాక్‌లో వ్యాయామం చేసుకునేలా అభివృద్ధి చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ వ్యాయామ పరికరాలను వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అగ్రెపు గుప్తా, పట్టణ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, డీఈ వీరయ్య, కౌన్సిలర్లు దూది నర్సింహమూర్తి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి

యలమంచిలి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులతో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి అన్నారు. శుక్రవారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలో జగనన్న కాలనీల్లో సమస్యలపై అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో తులసీనగర్‌లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలను హౌసింగ్ అధికారులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడి వారి నుండి నేరుగా సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించేలా చూస్తామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడి కాలనీ గృహాల బిల్లులు, నిర్మాణాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీఈ వీరయ్య హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు మేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చిన వలంటీర్,సచివాలయ వ్యవస్థలు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. దేశానికే ఈ రెండు సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మండలంలోని తోటాడ సచివాలయం వద్ద శుక్రవారం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ వలంటీర్లు తమకు కేటాయించిన 50 కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందుతున్న సేవల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా చూడాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ లబ్ధిని అందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు కూడా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు సమన్వయం చేసుకొని ప్రభుత్వానికి పేరు వచ్చేలా చూడాలన్నారు. నాలుగేళ్ల కాలంలో జరిగిన సంక్షేమంతో పాటు అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు,ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ,మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు,మార్కెట్‌కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు, పార్టీ నేతలు మళ్ల ఈశ్వరరావు,పాలమరశెట్టి జగదీష్,బొడ్డేడ శ్రీను,రవి తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సొంత నిధులతో సమకూర్చిన బ్యాగ్‌లను వలంటీర్లకు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు



గవర్ల అనకాపల్లిలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో శుక్రవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయిస్తున్నామన్నారు. రహదారులు, డ్రైనేజీల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలన్నారు. తద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డి బాలాజీ, షేక్ ఇస్మాయిల్, పార్టీ నేతలు మళ్ల ఈశ్వరరావు, బుద్ధ రమేష్, రవి, సర్పంచ్‌లు నాగప్పారావు, తాతాజీ, గంగప్పలనాయుడు పాల్గొన్నారు.

కాపుల ఆశలపై పవన్ నీళ్లు

- చంద్రబాబుకు ఊడిగం చేసేందుకే జనసేన పరిమితం
- ఒంటరిగా పోటీ చేసే సత్తా లేకే నైరాశ్యంలో ప్రకటనలు
- కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ



నక్కపల్లి : రాజకీయాల్లో ఉన్నంత కాలం చంద్రబాబు నాయుడికి ఊడిగం చేసేందుకే పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారని, కాపులను గంప గుత్తగా టీడీపీకి తాకట్టు పెట్టేశారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. తాను సీఎం రేసులో లేనని, అంతటి బలం నాకు లేదంటూ పవన్ కల్యాణం వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. ఒంటరిగా పోటీ చేసే సత్తా లేనప్పుడు పార్టీ స్థాపించడం, కాపు సోదరులకు ఆశలు కల్పించడం ఎందుకని ప్రశ్నించారు. జీవితాంతం చంద్రబాబునాయుడికి ఊడిగం చేద్దామని, రాజ్యాధికారానికి కాపులు అర్హులు కాదని పవన్‌కల్యాణ్ పరోక్షంగా చెబుతున్నారన్నారు. కులాలతో రాజకీయం చేయడం తనకు ఇష్టం లేదని చెబుతూనే కాపులను అడ్డం పెట్టుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు పవన్ కల్యాణ్ పావులు కదుపుతున్నాడన్నారు. ఇప్పటికైనా జనసైనికులు, కాపులు నిజాలు తెలుసుకోవాలని హితవు పలికారు. కాపులను రాజకీయంగా అణగదొక్కాలని గత 20 ఏళ్ల నుంచి చంద్రబాబు కుట్రలు చేస్తూనే ఉన్నారన్నారు. వంగవీటి మోహన్‌రంగా హత్యలో చంద్రబాబు పాత్ర ఉందని రాష్ట్రం కోడై కూస్తోందన్నారు. కాపులను బీసీల్లో చేర్చాలని ముద్రగడ పద్మనాభం చేసిన శాంతియుత ఆందోళనను రాజకీయం చేసి, అరాచకాలు సృష్టించి అక్రమ కేసులు బనాయించిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనన్నారు. అక్రమ కేసులను ఇటీవల కోర్టు కొట్టి వేసిందని, టీడీపీ ప్రభుత్వంలో కాపులపై నమోదైన కేసులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాపుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు.

సీబీఎస్ఈలో శ్రీప్రకాష్‌కు ఉత్తమ ఫలితాలు



పి.సాయి సౌమ్య   మహాలక్ష్మి   ప్రత్యూష ప్రధాన్   ఎన్.సూర్యచరణ్   వి.హరినయన్

పాయకరావుపేట : శుక్రవారం ప్రకటించిన సీబీఎస్ఈ పదో తరగతి, ప్లస్ 2 ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పదో తరగతి ఫలితాలలో పి.సాయి సౌమ్య 490, ఎ.ఎ స్.డి. మహాలక్ష్మి 487, బి.కీర్తన 483, కె.హేమంత్ 482, వి.హరినయన్ 481 మార్కులు, జోషిత 479 మార్కులతో అగ్రగామిగా నిలిచారని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణతా ఫలితాలతో, 90 శాతం పైగా విద్యార్థులు ప్రథమశ్రేణిలో విజయకేతనం ఎగురవేశారు. ప్లస్ 2 ఫలితాల్లో బై.పి.సిలో 464 మార్కులతో ప్రత్యూష ప్రధాన్, ఎం.పి.సి.లో ఎన్.సూర్యచరణ్-460, ఎస్.అశోక్ 452 మార్కులు సాధించి అగ్రగాములుగా నిలిచారని, 88 శాతం విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవడమే కాకుండా, నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్ భానుమూర్తి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

రోగుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలి



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి

కోటవురట్ల : ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని మండల ప్రత్యేక అధికారి ఉదయ శ్రీ సూచించారు. కె.వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఓపీ, గదులను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ప్రసవాలపై దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, డాక్టర్ సంతోష్ కుమార్, ఎంపీహెచ్ఈవో గోవిందరావు పాల్గొన్నారు.